సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 5 । జనవరి । 2024



రైతు భరోసా అంతంతే..

యాసంగి మొదలై నెలరోజులు గడిచినప్పటికీ రైతులకు పెట్టుబడి సాయం విషయంలో సందిగ్ధత నెలకొంది.

- 8లో ▸



మళ్లీ తెరుచుకున్న 'బెల్ట్'

గ్రామాల్లో మద్యం ప్రవాహానికి కారణం అవుతున్న బెల్ట్ షాపులు గుట్టుచప్పుడు కాకుండా మళ్లీ తెరుచుకుంటున్నాయి.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.6 / 18.9

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లటిగాలులు వీస్తాయి. సాయంత్రం నుంచి చలి తీవ్రత పెరుగుతుంది. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఓపెన్ వర్సిటీ పరీక్ష ఫీజు గడువు పెంపు

నిజామాబాద్ అర్బన్ : బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పీజీ మొదటి సంవత్సరం సప్లిమెంటరీ పరీక్ష ఫీజు గడువు పెంచినట్లు వర్సిటీ కోఆర్డినేటర్ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10వ తేదీ లోపు రూ. 500 అపరాధ రుసుముతో పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు. అలాగే డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్ష ఫీజు రూ. 500 అపరాధ రుసుముతో ఈనెల 23వ తేదీ లోపు చెల్లించాలన్నారు. అలాగే ఈనెల 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఫీజు సెకండియర్ పరీక్షలు, ఈనెల 27 నుంచి 31 తేదీ వరకు ఫస్ట్ ఇయర్ పరీక్షలు, ఫిబ్రవరి 16 తేదీ నుండి 22వ తేదీ వరకు యూజీ మూడో సెమిస్టర్ పరీక్షలు, ఫిబ్రవరి 26వ తేదీ నుంచి మార్చి రెండో తేదీ వరకు యూజీ ఐదో సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయన్నారు.

ఆర్మూర్ బల్దియా వద్ద భారీ బందోబస్తు



ఆర్మూర్/ఆర్మూర్ టౌన్ : ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీతపై అవిశ్వాస తీర్మానం సమావేశం నిర్వహించిన నేపథ్యంలో ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయం చుట్టూ పోలీసులు గురువారం భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఆర్మూర్ ఏసీపీ జగదీశ్‌చందర్ ఆధ్వర్యంలో ఆర్మూర్, ఆర్మూర్ రూరల్, భీమ్‌గల్ సీఐలు సురేష్ బాబు, గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు సుమారు పది మంది ఎస్సైలు బందోబస్తు నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం సమీపంలోని పాతబస్టాండ్ నుంచి పంత్‌రోడ్డు మీదుగా అంగడి బజార్ వరకు పోలీసులు తమ స్వాధీనంలోకి తీసుకున్నారు. వ్యాపార సముదాయాలను మూసివేయించారు.

టీచర్లకు పాతపెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలి



నిజామాబాద్ అర్బన్ : కేంద్ర ప్రభుత్వ మెమో.57 ఆధారంగా డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని కోరుతూ గురువారం హైదరాబద్‌లో ఐటీ శాఖ మంత్రి, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్ బాబు, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశ్‌ను డీఎస్సీ 2003 టీచర్లు కలిశారు. ఈ సందర్భంగా వారు వినతిపత్రం అందజేశారు. దీనికి మంత్రి స్పందిస్తూ త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు రాష్ట్ర అధ్యక్షుడు మాడవేటి వినోద్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో 2003 డీఎస్సీ పాత పెన్షన్ పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇమ్మడి సంతోష్‌కుమార్, కోశాధికారి వేణుగోపాల్, విజయ్ కుమార్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ కో కన్వీనర్‌గా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



సుభాష్‌నగర్ : అయోధ్యలోని శ్రీరామమందిరం ప్రారంభోత్సవ కమిటీ తెలంగాణ కో కన్వీనర్‌గా నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు అయోధ్య రామమందిరం పునర్నిర్మాణ కమిటీ ప్రతినిధులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ధన్‌పాల్ సూర్యనారాయణను తెలంగాణ కో కన్వీనర్‌గా నియమించడంపై బీజేపీ నాయకులు, కార్యకర్తలు, హిందూ బంధువులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులను అయోధ్య శ్రీరామ మందిరం ప్రారంభోత్సవానికి తరలించేందుకు ఆయన కసరత్తు చేయనున్నారు.

ద్విముఖమా.. త్రిముఖమా?

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నిజామాబాద్‌లో పోరుపై ఆసక్తి

- అసెంబ్లీ ఎన్నికల్లో మిశ్రమ ఫలితాలతో ప్రత్యేక వాతావరణం
- లోక్‌సభ పరిధిలో కాంగ్రెస్ 2, బీజేపీ 2, బీఆర్‌ఎస్ 3 స్థానాల్లో విజయం
- సిట్టింగ్ కావడంతో పాటు మోదీ చరిష్మా కలిసొస్తుందనే ధీమాలో అర్వింద్
- రాష్ట్రంలో అధికారం దక్కడంతో ఊపుమీదున్న కాంగ్రెస్
- అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలో అత్యధిక ఓట్లు దక్కించుకున్న బీఆర్‌ఎస్



రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ ద్విముఖమా.. త్రిముఖమా అనేది ఆయా వర్గాల్లో చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో అధికారం దక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ ఊపుమీదుంది. బీఆర్‌ఎస్ తాజా అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలో అత్యధికంగా మూడు సీట్లు గెలుచుకుంది. 'పసుపు బోర్డు' ఏర్పాటుపై కేంద్రం చేసిన ప్రకటన తమకు కలిసి వస్తుందని, అదేవిధంగా ప్రధాని మోదీ చరిష్మా తిరుగులేని విధంగా ఉపయోగపడుతుందని బీజేపీ సిట్టింగ్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ధీమాతో ఉన్నారు.

– సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

ఉత్తర తెలంగాణలో విలక్షణ తీర్పులకు పేరు పొందిన నిజామాబాద్ ప్రాంతానికి ప్రత్యేక పేరుంది. ఈ నేపథ్యంలో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ స్థానంలో నెలకొనబోయే పోటీపై వివిధ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఇక్కడ పోరు ద్విముఖమా.. త్రిముఖమా అనే అంశంపై ఆయా వర్గాల్లో చర్చ జరుగుతోంది. తాజాగా జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఇందూరు పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ 2, బీజేపీ 2, బీఆర్‌ఎస్ 3 సీట్లు గెలుచుకున్నాయి. మూడు పార్టీలు ఓట్ల విషయంలో పోటాపోటీగా ఉన్నాయి. అయితే రాష్ట్రంలో అధికారం దక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఊపుమీదుంది. ఈ క్రమంలో నిజామాబాద్ లోక్‌సభ స్థానాన్ని చేజిక్కించుకునేందుకు పావులు కదుపుతోంది. పార్లమెంట్ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు గాను కాంగ్రెస్ రెండు స్థానాలు మాత్రమే గెలుచుకున్నప్పటికీ ఓట్లు మాత్రం భారీగా సాధించింది. జవసత్వాలు కోల్పోయిన కాంగ్రెస్‌కు అధికారం దక్కడంతో పాటు ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థులందరికీ కలిపి 4,08,135 ఓట్లు వచ్చాయి. నిజామాబాద్ రూరల్, బోధన్ నియోజకవర్గాల్లో అభ్యర్థులు విజయం సాధించారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఎవరనే విషయమై ఇప్పటికీ ఒక స్పష్టత లేదు. అభ్యర్థిని బట్టి కాంగ్రెస్ గెలుపు అవకాశాలు ఆధారపడి ఉండడం గమనార్హం.

పసుపుబోర్డు ప్రకటనతో బీజేపీలో ధీమా

బీజేపీ సిట్టింగ్ ఎంపీ ధర్మపురి అర్వింద్ వరుసగా రెండోసారి విజయం సాధించేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. మోదీ చరిష్మా తిరుగులేని విధంగా ఉపయోగపడుతుందని అర్వింద్ ధీమాతో ఉన్నారు. పైగా గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రకటన మరింతగా కలిసి వస్తుందని భావిస్తున్నారు. ఇదిలా ఉండగా గత నెలలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో బీజేపీకి పార్లమెంట్ స్థానం పరిధిలో 3,65,374 ఓట్లు వచ్చాయి. గతంలోని శాసనసభ ఎన్నికలతో పోలిస్తే ఈ ఓట్లు అనేకరెట్లు ఎక్కువ. కాగా గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి నిజామాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలో 45.22 శాతంతో 4,80,584 ఓట్లు వచ్చాయి.

తాజా శాసనసభ ఎన్నికల్లో ఓట్ల శాతం భారీగా పెరిగినందున బీజేపీ గెలుపుపై ధీమాగా ఉంది. బీజేపీ అధినాయకత్వం సైతం ఈ సీటుతో పాటు ఉత్తర తెలంగాణలోని అన్ని సీట్లపై భారీ ఆశలు పెట్టుకుంది. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఈ ప్రాంతంలో పర్యటించి అంతర్గతంగా పార్టీ శ్రేణులతో సమావేశమై గట్టి వ్యూహరచన చేస్తుండడం గమనార్హం.

నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌లో బీజేపీకి వచ్చిన ఓట్ల శాతం

సెగ్మెంట్	2018	2023
ఆర్మూర్	13.96	44.09
బోధన్	5.31	19.52
అర్బన్	15.99	40.82
రూరల్	9.52	25.05
బాల్కొండ	2.00	17.03
కోరుట్ల	9.79	33.67
జగిత్యాల	3.02	23.89

2023లో నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో పార్టీలకు వచ్చిన ఓట్లు

సెగ్మెంట్	కాంగ్రెస్	బీఆర్‌ఎస్	బీజేపీ
అర్బన్	59,853	44,828	75,240
రూరల్	78,378	56,415	49,723
ఆర్మూర్	42,989	39,395	72,658
బాల్కొండ	65,884	70,417	30,250
బోధన్	66,963	63,901	33,555
కోరుట్ల	39,647	72,115	61,810
జగిత్యాల	54,421	70,243	42,138
మొత్తం	4,08,135	4,17,314	3,65,374

కవిత పోటీలో ఉంటారా..?

పార్లమెంట్ పరిధిలో బీఆర్‌ఎస్ అత్యధికంగా మూడు సీట్లు గెలుచుకుంది. బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల శాసనసభ స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. మొత్తం 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో కలిపి అత్యధికంగా 4,17,314 ఓట్లు సాధించింది. కాని బీఆర్‌ఎస్ రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోయింది. ఈ పరిస్థితుల్లో బీఆర్‌ఎస్ నుంచి అభ్యర్థి ఎవరు నిలబడతారనే ఆసక్తి నెలకొంది. మాజీ ఎంపీ, ప్రస్తుత ఎమ్మెల్సీ కవిత బరిలో నిలబడతారా లేదా అనే సందిగ్ధత పార్టీ నాయకులు, శ్రేణుల్లో నెలకొంది. ఎన్నికల కోడ్ వచ్చే సమయానికి రాజకీయ సమీకరణలు ఏవిధంగా మారతాయోననే విషయమై గందరగోళంగా ఉంది. కవిత బరిలో నిలుస్తారా లేక మరెవరినైనా బరిలోకి దించుతారా అనేదాంట్లో స్పష్టత లేదు.

నెగ్గిన అవిశ్వాసం..



ఆర్మూర్ బల్దియా చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానానికి మద్దతు తెలుపుతున్న కౌన్సిలర్లు

- ఆర్మూర్ బల్దియా చైర్‌పర్సన్‌పై నెగ్గిన తీర్మానం
- సొంత పార్టీ చైర్‌పర్సన్‌నే దించేసిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు
- వారితో కలిసిన బీజేపీ, ఎంఐఎం, స్వతంత్ర కౌన్సిలర్లు
- సమావేశానికి గైర్హాజరైన చైర్‌పర్సన్ వర్గం



సమావేశానికి హాజరైన ఆర్డీవో వినోద్ కుమార్, ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్

ఆర్మూర్/ఆర్మూర్ టౌన్ : ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీతపై సొంత పార్టీకే చెందిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు తిరుగుబాటు చేసి ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్, ఆర్మూర్ ఆర్డీవో వినోద్ కుమార్ ఆధ్వర్యంలో అవిశ్వాస తీర్మానం సమావేశాన్ని గురువారం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్ పాల్గొన్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సమావేశానికి బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు 17 మంది ప్రైవేటు బస్సులో క్యాంపు నుంచి నేరుగా వచ్చారు. వీరితో పాటు కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన కౌన్సిలర్ కూడా ఉన్నారు. నలుగురు బీజేపీ కౌన్సిలర్లు హాజరు కాగా వీరిలో బీఆర్‌ఎస్ నుంచి గెలిచి బీజేపీలో చేరిన కౌన్సిలర్ కూడా ఉన్నారు. ఎంఐఎం కౌన్సిలర్ ఒకరు, ఇద్దరు స్వతంత్ర కౌన్సిలర్లు కలిపి మొత్తం 24 మంది కౌన్సిలర్లు సమావేశానికి హాజరయ్యారు. చైర్‌పర్సన్ పండిత్ వినీత వర్గానికి చెందిన 12 మంది కౌన్సిలర్లు అస్త్ర సన్యాసం చేసి సమావేశానికి గైర్హాజరయ్యారు. ఈ సమావేశానికి ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి కూడా హాజరయ్యారు.

కోరం సరిపోవడంతో..

సమావేశం నిర్వహించేందుకు అవసరమైన కోరం 25 మంది సభ్యులు హాజరు కావడంతో స్పెషల్ ఆఫీసర్ బలపరీక్ష నిర్వహించగా వీరంతా చైర్‌పర్సన్ పండిత్ వినీతపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటేశారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు స్పెషల్ ఆఫీసర్ వినోద్ కుమార్ ప్రకటించారు. నాలుగేళ్లుగా చైర్‌పర్సన్ కుటుంబ సభ్యుల అవినీతిపై పోరాటాలు చేస్తున్న బీజేపీ కౌన్సిలర్లు తమ పార్టీ రాష్ట్రస్థాయి నాయకుల ఒత్తిడికి తలొగ్గకుండా అవిశ్వాసానికి అనుకూలంగా ఓటేయడంతో బీఆర్‌ఎస్ కౌన్సిలర్లకు కలిసిరాగా పండిత్ వినీత చైర్‌పర్సన్ పదవిని కోల్పోయారు.

తీవ్ర వ్యతిరేకత..

ఆర్మూర్ పట్టణంలోని 33వ వార్డు నుంచి టీఆర్‌ఎస్ అభ్యర్థిగా పండిత్ వినీత మొదటిసారి పోటీలో నిలబడ్డారు. చైర్‌పర్సన్‌కు బీసీ మహిళ రిజర్వేషన్ కలిసి రావడంతో తన మరిది మాజీ కౌన్సిలర్ పండిత్ ప్రేమ్ రాజకీయ నేపథ్యాన్ని పునాదిగా చేసుకొని ఏకగ్రీవంగా ఎన్నికై 2020 జనవరి 27న ఆర్మూర్ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. తన పదవి నాలుగేళ్లు పూర్తి కావడానికి మరో 23 రోజులుండగానే సొంత పార్టీ నుంచే వ్యతిరేకత వచ్చి పదవిని కోల్పోయారు. అసెంబ్లీ ఎన్నికల్లో చైర్‌పర్సన్ భర్త పండిత్ పవన్ బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా పనిచేశాడని బీఆర్‌ఎస్ కౌన్సిలర్ మాజీ ప్రజాప్రతినిధి జీవన్‌రెడ్డిని సంప్రదించారు. ఆయన సూచనతో అవిశ్వాస తీర్మానం పెట్టారు. మున్సిపల్ నూతన చైర్‌పర్సన్ ఎంపిక ఏరోజు చేయనున్నారనే విషయమై కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు త్వరలో ఆదేశాలివ్వనున్నారు.

ఆర్మూర్ బల్దియాలో మొదటి అవిశ్వాసం 10లో..

ప్రజావిజయం..



ఆర్మూర్ మున్సిపాలిటీలో నాలుగేళ్లుగా జరుగుతున్న అక్రమాలకు చెక్‌పెడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా సాగిన ఈ సమావేశంలో ప్రజా విజయం చోటు చేసుకుంది. నేను రాజకీయాల్లోకి రాగానే ఒక వికెట్ పడింది. మున్సిపాలిటీలో అడుగు పెట్టగానే ఇక్కడా ఓ వికెట్ పడింది. అవినీతిపై మరో విజయం సాధించాం. మున్సిపాలిటీలో కూడా బీజేపీ అధికారంలో ఉండాలని ఆర్మూర్ ప్రాంత ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

– పైడి రాకేశ్ రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే

విద్యావైద్యానికి అధిక ప్రాధాన్యత



మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- ఆరోగ్యశ్రీ పథకాన్ని బలోపేతం చేస్తాం
- జక్రాన్‌పల్లిలో జెడ్పీహెచ్‌ఎస్ కొత్త భవనాన్ని ప్రారంభించిన మంత్రి

జక్రాన్‌పల్లి : విద్యా వైద్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. గురువారం జక్రాన్‌పల్లిలో మన ఊరు మన బడి కింద రూ. 62.77లక్షల నిధులతో పాటు దాతలు పెద్దఎత్తున విరాళాలివ్వగా అధునాతన హంగులతో నిర్మించిన ఉన్నత పాఠశాల నూతన సముదాయాన్ని మంత్రి ప్రారంభించారు. జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ లాలన వృద్ధాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు పైపుల రాజిరెడ్డి సహకారంతో సుమారు రూ. 3 కోట్ల వ్యయంతో పాఠశాల నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. దాతృత్వానికి మరోరూపం పైపుల రాజిరెడ్డి అన్నారు. గతంలో సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో తాను విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడే తెయూ ఏర్పాటు చేశామన్నారు.దివంగత వైఎస్ హయాంలో ఆరోగ్యశ్రీ పథకం ఎంతో మందికి ఉపయోగపడిందన్నారు. దీని పరిధికి రూ. 10లక్షలకు పెంచేందుకు కృషి చేస్తామన్నారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి మండలంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ప్రభుత్వ పాఠశాలలను నిర్మిస్తామన్నారు. డిచ్‌పల్లిలో మాతాశిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రం, ఇందల్వాయిలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. అంతకు ముందు జక్రాన్‌పల్లి శివారులోని దేవని తోటలో ఉన్న శ్రీలక్ష్మీనర్సింహ ఆలయంలో మంత్రి, ఎమ్మెల్యే భూపతిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు తనుజారెడ్డి, ఎంపీపీ విమల, సర్పంచ్ చంద్రకళ, ఉపసర్పంచ్ బాల్‌కిషన్, ఎంపీటీసీ సభ్యులు గంగారెడ్డి, మరియ,గడుగు గంగాధర్, సునీల్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, ముస్కు సాయారెడ్డి, చిన్న సాయారెడ్డి, ముప్ప గంగారెడ్డి తదితరులున్నారు.

పసుపు ధరపై గంపెడాశలు

- సాగు విస్తీర్ణం తగ్గడంతో..
- క్వింటాలుకు రూ. 10 వేలకు పైనే పలుకుతుందని అంచనా
- మరో 15 రోజుల్లో మార్కెట్‌కు పచ్చబంగారం



మార్కెట్ కమిటీలో పసుపు (ఫైల్)

సుభాష్‌నగర్ : పచ్చబంగారానికి ఈ ఏడాది కలిసొస్తుందని రైతులు గంపెడాశతో ఉన్నారు. పసుపు సాగు గణనీయంగా తగ్గడంతోపాటు సార్వత్రిక ఎన్నికల వేళధర కలిసొస్తుందని ఆశిస్తున్నారు. ఈ సీజన్‌లో సగటున క్వింటాలుకు రూ.10వేల పైచిలుకు ధర పలుకుతుందని నమ్మకంతో ఉన్నారు. మరో 15 రోజుల్లో మార్కెట్‌కు పంట రానుంది.

20వేల ఎకరాల్లోనే సాగు..

జిల్లావ్యాప్తంగా ఆర్మూర్, బాల్కొండ, బోధన్, రూరల్ నియోజకవర్గాల్లో రైతులు పసుపు పండిస్తారు. అత్యధికంగా ఆర్మూర్, బాల్కొండలో పండిస్తున్నారు. ఈ ఏడాది 20,650 ఎకరాల్లో పసుపు సాగైంది. క్రమక్రమంగా పసుపు సాగుకు రైతులు దూరమవుతున్నారు. ఎర్ర గుంటూరు, ఇతర ఆర్మూర్ రకాలను అధికశాతం రైతులు సాగు చేశారు. జిల్లాలో పండించిన పసుపును రైతులు నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీతోపాటు మహారాష్ట్రలోని సాంగ్లి మార్కెట్‌కు తరలిస్తారు. అదేవిధంగా ఈ మార్కెట్‌కు జిల్లాతోపాటు మహారాష్ట్ర, నిర్మల్, జగిత్యాల్, ఆదిలాబాద్, కామారెడ్డి, ఆంధ్రప్రదేశ్ నుంచి పసుపు తీసుకొచ్చి విక్రయిస్తారు. ఎకరానికి 18 నుంచి 22 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశముంది.


కలిసొచ్చే అంశాలివే..

ఈసారి పసుపు సాగు పడిపోవడంతో అంతర్జాతీయ, జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఏర్పడే అవకాశముంది. దీనికితోడు సార్వత్రిక ఎ న్నికలు కూడా దగ్గర పడుతున్నాయి. పసుపు ధర కలిసొస్తేనే రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తారు. లేకుంటే ఈ ప్రభావం నిజామాబాద్, ఆదిలాబాద్‌తోపాటు కరీంనగర్ పార్లమెంట్ స్థానాలపై పడే అవకాశముంది. గతేడాది పసుపు క్వింటాలుకు రూ.7,500 సగటున పలికింది. ఈసారి సాగు విస్తీర్ణం పడిపోయిన దృష్ట్యా రూ. 10 వేల నుంచి రూ. 12 వేల వరకు పలికే అవకాశముంది. ఏప్రిల్, మే నెల వరకు పంట ఆపితే రూ. 15వేలు కూడా పలకొచ్చని పేర్కొంటున్నారు.

2.40 లక్షల క్వింటాళ్ల పసుపు కోల్డ్ స్టోరేజీల్లో..

జిల్లాలోని కోల్డ్‌స్టోరేజీల్లో సుమారు 2.40 లక్షల క్వింటాళ్ల పసుపు పంట నిల్వ ఉంది. ఈసారి పంట విస్తీర్ణం పడిపోయిందని గ్రహించిన వ్యాపారులు.. ధర ఎలాగైనా పెరుగుతుందనే ఉద్దేశంతో నిల్వ ఉంచిన పసుపును విక్రయించేందుకు ఆసక్తి చూపడంలేదు. జిల్లాలో సాగైన పంటకు 4 లక్షలకు మించి దిగుబడులు రావు.

ఎండబెట్టిన పసుపు తేవాలి



రైతులు మంచిగా ఎండబెట్టిన పసుపునే మార్కెట్‌కు తీసుకురావాలి. ఈసారి మార్కెట్‌లో పసుపునకు మంచి డిమాండ్ ఉంటుంది. కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకునే అవకాశం మార్కెటింగ్ శాఖ కల్పిస్తోంది. పంటపై 75 శాతం, రూ. 2 లక్షల వరకు రుణమిస్తాం.

– వెంకటేశం, సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ, నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్

ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

జక్రాన్‌పల్లి : ప్రజాపాలనలో ఆరు గ్యారంటీ పథకాలపై స్వీకరించిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు సూచించారు. గురువారం జక్రాన్‌పల్లి మండలంలోని పడకల్‌లో ప్రజాపాలనలో భాగంగా స్వీకరించిన దరఖాస్తులను కలెక్టర్ పరిశీలించారు. ఆయా గ్రామ జీపీల్లో ఉన్న కంప్యూటర్ లేదా ట్యాబ్‌లలో దరఖాస్తుదారుల వివరాలను నమోదు చేయాలన్నారు. గ్రామంలోని కొందరు వ్యక్తుల అసైన్డ్ భూములు ధరణి పోర్టల్‌లో ఆన్‌లైన్ కాలేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్, ఉపసర్పంచ్ రిత్విక్, మండల స్పెషల్ ఆఫీసర్ తిరుమల ప్రసాద్, తహశీల్దార్ ఖలీం, ఎంపీడీవో బ్రహ్మానందం, జీపీ కార్యదర్శి భరత్‌కుమార్, ఆర్ఐ ప్రవీణ్, ఏవో దేవిక, ఏపీవో రవి, తదితరులు ఉన్నారు.

ఆరో రోజు 49,881 దరఖాస్తులు

సుభాష్‌నగర్ : జిల్లావ్యాప్తంగా ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తులు గురువారం 49,881 దరఖాస్తులు స్వీకరించారు. ఇప్పటిదాకా 4,02,193 దరఖాస్తులు వచ్చాయని డీపీవో జయసుధ తెలిపారు. గురువారం ఒక్కరోజే 17,736 దరఖాస్తులు వచ్చాయన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

రైల్వే ప్లాట్‌ఫాంపై రెండేళ్లపాప

- బిడ్డను వదిలించుకున్నారు..
- ఐసీడీఎస్ అధికారులకు అప్పగించిన పోలీసులు
- కామారెడ్డి స్టేషన్‌లో ఘటన

కామారెడ్డి క్రైం: కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో రెండేళ్ల చిన్నారిని వదిలించుకుందో మహిళ.. ఆమె చిన్నారికి కన్న తల్లియేనా..? ఇంకెవరైనా ఉన్నారా వివరాలు తెలియ రాలేదు. గురువారం సాయంత్రం 6.40 గంటలకు అకోల ఎక్స్‌ప్రెస్ హైదరాబాద్ వైపు వెళ్తూ కామారెడ్డి స్టేషన్‌లో ఆగింది. ఓ ముసలావిడ రైలులో నుంచి కిందకు దిగి రెండేళ్ల చిన్నారిని ప్లాట్‌ఫాంపై వదిలి రైలెక్కింది. రైలు కదలడం, పాప ప్లాట్‌ఫాంపై ఏడుస్తుండటం గమనించిన స్టేషన్‌లోని ప్రయాణికులు అలా ఎందుకు వదిలి వెళ్తున్నావంటూ కేకలు వేశారు. రైలులోని ప్రయాణికులు కొందరు చైన్ లాగడంతో రైలు ఆగింది. రైల్వే పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పాపను వదిలి రైలెక్కిన ముసలావిడను గుర్తించి విచారించారు. ఎవరో గుర్తు తెలియని తోటి ప్రయాణికురాలు ఒక్క నిమిషంలో వస్తానని చెప్పి బిడ్డను నా చేతిలో పెట్టి రైలు దిగిందని ఆ ముసలావిడ తెలిపింది. ఆమె తిరిగి రాకపోగా రైలు కదలడంతో ఏం చేయాలో తోచక బిడ్డను ప్లాట్‌ఫాంపై వదిలానని చెప్పింది. రైలులోని మరికొందరు కూడా ఆమె మాటలు నిజమేనని, తాము కూడా చూశామని చెప్పడంతో చిన్నారిని పోలీసులు తమ ఆధీనంలోకి ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు.



కామారెడ్డి రైల్వేస్టేషన్‌లో చిన్నారిని ఓదారుస్తున్న స్థానికుడు

క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో గురువారం నిర్వహించిన జాతీయస్థాయి మహిళా సింగిల్స్‌ టెన్నికాయిట్‌ పోటీలకు నలుగురు క్రీడాకారిణులు ఎంపికైనట్లు జిల్లా సంఘం ప్రతినిధులు మల్లేశ్‌గౌడ్‌, భూపతి తెలిపారు. ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు శ్రీకాకుళంలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు క్రీడాకారిణులు త్రిష, ప్రసజ్ఞ, నవనీత, ఉమారాణి ఎంపికైనట్లు పేర్కొన్నారు. అనంతరం క్రీడాకారులను సంఘం వైస్‌ ప్రెసిడెంట్‌ జలంధర్‌, హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, గంగానర్సయ్య, భూమేశ్‌, లక్ష్మణ్‌, మల్లయ్య అభినందించారు.

నేడు రగ్బీ పోటీలకు..

మోపాల్‌: జిల్లా స్థాయి అండర్‌–14 రగ్బీ క్రీడా పోటీలకు మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో క్రీడాకారులను శుక్రవారం ఎంపిక నిర్వహించనున్నట్లు అసోసియేషన్‌ అధ్యక్షుడు రెంజర్ల నరేశ్‌, ఉపాధ్యక్షుడు రాజ్‌గణేశ్‌, కార్యదర్శి అబ్బయ్య గురువారం తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 9 గంటల వరకు పాఠశాలకు చేరుకోవాలని కోరారు.

యూరియా కోసం బారులు



సిరికొండ: మండలంలోని సొసైటీల్లో యూరియా లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలోని సొసైటీకి గురువారం మూడు లారీల్లో యూరియా రాగా వాటి కోసం రైతులు గంటల తరబడి క్యూలో నిల్చున్నారు. తగినంత యూరియా సరఫరా కాకపోవడంతో రైతులకు నిరీక్షణ తప్పలేదు.

నిజాయితీ చాటిన కండక్టర్‌



ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ ఆర్టీసీ డిపోకు చెందిన బస్‌ కండక్టర్‌ గంగాధర్‌ తన నిజాయితీని చాటుకున్నారు. జేబీఎస్‌ బస్టాండ్‌లో కావ్య, మేఘన అనే అమ్మాయిలు గురువారం బస్సు ఎక్కారు. బస్సులో ప్రయాణికులు ఎక్కువగా ఉండటంతో వారు దిగిపోయారు. కానీ వారి బ్యాగులను మాత్రం బస్సులో మర్చిపోయారు. కండక్టర్‌ ఆ బ్యాగులను ఆర్మూర్‌ డిపోలో భద్రపర్చారు. వారు మరో బస్సులో ఆర్మూర్‌కు రాగా డిపోలో కండక్టర్‌, పోలీసు సిబ్బంది బ్యాగును అందజేశారు.

సైబర్‌ నేరాలపై అవగాహన



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో విద్యార్థులకు దేవునిపల్లి పోలీసులు గురువారం సైబర్‌నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్‌ సెల్‌ ఇన్‌చార్జి సీఐ ప్రసాద్‌, పోలీసు కళాబృందం సభ్యులు ఎవరికైనా సైబర్‌నేరాలు ఎదురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. మోసపూరిత ఫోన్‌ కాల్స్‌ నమ్మవద్దని, ఫోన్‌కు వచ్చే ఓటీపీలను ఎవరికీ చెప్పొద్దని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు భరోసా అంతంత మాత్రమే..

- ఇప్పటి వరకు పది శాతమే అందిన యాసంగి పెట్టుబడి సాయం
- గత ప్రభుత్వంలో ఉన్నాయన్న నిధులు.. ప్రస్తుతం పక్కదారి పట్టాయా..?



మోర్తాడ్‌: యాసంగి పంటలు మొదలై నెల రోజులు గడుస్తోంది. కానీ రైతులకు మాత్రం పెట్టుబడి సాయం అంతంత మాత్రంగానే సాగుతోంది. ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం నిధులు ఉన్నాయని రైతుబంధు నిధులను విడుదల చేయడానికి అనుమతి ఇవ్వాలని ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేసింది. కానీ ఎన్నికల కమిషన్‌ అభ్యంతరం తెలుపడంతో అవి అలాగే నిలిచిపోయాయి. ఎన్నికలు ముగిసిన తరువాత కాంగ్రెస్‌ ప్రభుత్వం ఏర్పాటుతో పెట్టుబడి సాయం పథకాన్ని రైతుభరోసాగా మార్చింది. ఈ పథకం కింద రైతులకు ఎకరానికి పెట్టుబడి సాయాన్ని రూ.7,500 చొప్పున అందిస్తామని కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. రైతుభరోసా మార్గదర్శకాలను జారీ చేసే వరకు పెట్టుబడి సాయాన్ని పాత పద్ధతిలోనే అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. డిసెంబర్‌లో పెట్టుబడి సాయం నిధులను విడుదల చేయడం ఆరంభించగా ఇప్పటి వరకు ఎకరం కంటే ఎక్కువ ఉన్న భూములకు సాయం అందలేదు.

98,583 మంది రైతులకే పెట్టుబడి సాయం

జిల్లాలో ఇప్పటి వరకు 98,583 మంది రైతులకు రూ.28.29 కోట్ల పెట్టుబడి సాయం అందింది. వాస్తవానికి జిల్లాలో 2,78,351 మంది రైతులకు రూ.274 కోట్ల సాయం నిధులు విడుదల కావాల్సి ఉంది. మెజార్టీ రైతులు చిన్న సన్నకారు వారు ఉండటంతో ఎక్కువ మంది రైతులకు యాసంగి సీజను పెట్టుబడి సాయం జమ చేశారు. కానీ ఇప్పటి వరకు పది శాతం నిధులే జమ కావడం గమనార్హం. ఎన్నికలకు ముందు పెట్టుబడి సాయం కోసం ఉన్న నిధులు ఎన్నికల తరువాత దారి మళ్లాయా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. లేదా గత ప్రభుత్వమే ఎన్నికల కమిషన్‌కు తప్పుడు సమాచారం అందించిందా అనే వాదనలు వినిపిస్తున్నాయి. పెట్టుబడి సాయం నిధులను దారి మళ్లించకుండా చూడాలని అప్పట్లో కాంగ్రెస్‌ నేతలు ఎన్నికల కమిషన్‌ను మొరపెట్టుకున్నారు. అయినా సాయం నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం స్పందించి పెట్టుబడి సాయాన్ని త్వరగా అందించాలని రైతులు కోరుతున్నారు.

అందరికీ అందుతుంది

పెట్టుబడి సాయం అందరి రైతులకు జమ అవుతుంది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ ఆదేశానుసారం నిధులు మంజూరు కాగానే పెట్టుబడి సాయం అందిస్తాం. త్వరలోనే అందరి రైతులకు పెట్టుబడి సాయం అందుతుంది.

– వాజీద్‌ హుస్సేన్‌, జిల్లా వ్యవసాయాధికారి

మళ్లీ తెరుచుకున్న 'బెల్ట్‌'

- ఆదాయంపై దృష్టి పెట్టిన గ్రామ కమిటీలు
- జోరుగా వేలం పాటల నిర్వహణ



మోర్తాడ్‌: గ్రామాల్లో మద్యం ప్రవాహాలకు కారణమైన బెల్ట్‌షాపులను కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్‌ ప్రభుత్వం మూసివేయించినా మళ్లీ గుట్టుచప్పుడు కాకుండా బెల్ట్‌షాపుల నిర్వహణ సాగుతూనే ఉంది. ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించే విధంగా గ్రామాల్లో మద్యం అమ్మకాలు మరోసారి ఊపందుకున్నాయి. తమకు దండిగా ఆదాయం బెల్ట్‌షాపుల ద్వారానే లభిస్తుండటంతో గ్రామ కమిటీలు వేలం నిర్వహణపై దృష్టి సారించాయి. బెల్ట్‌షాపుల నిర్వహణ కోసం గ్రామ కమిటీలు వేలం నిర్వహిస్తుండగా ఆయా గ్రామాల్లో మద్యం అమ్మకాల విలువ ఆధారంగా వేలం జరుగుతోంది. జిల్లాలోని మోర్తాడ్‌, భీమ్‌గల్‌, ఆర్మూర్‌, నిజామాబాద్‌, బోధన్‌లలో ఎక్సైజ్‌ సర్కిల్‌ కార్యాలయాలు ఉండగా వీటి పరిధిలో 102 లైసెన్స్‌డ్‌ మద్యం దుకాణాలు ఉన్నాయి. దాదాపు 500ల వరకు బెల్ట్‌షాపులు ఉన్నాయి. ఒక్కో గ్రామ కమిటీకి బెల్ట్‌షాపుల వల్ల ఏడాదికి రూ.1.50లక్షల నుంచి రూ.8లక్షల వరకు ఆదాయం సమకూరుతుంది. రోజుకు రూ.30వేల నుంచి రూ.50వేల వరకు మద్యం అమ్మే బెల్ట్‌షాపుల నుంచి కొన్ని కమిటీలకు ఏడాదికి రూ.8లక్షల వరకు ఆదాయం వస్తుంది. ఇదిలా ఉండగా కొన్ని గ్రామాల్లోని బెల్ట్‌షాపులను వైన్స్‌ల యజమానులే నిర్వహిస్తుండటం గమనార్హం. ఆయా గ్రామాల్లోని వ్యక్తులతో బెల్ట్‌షాపుల వేలాన్ని దక్కించుకుని వైన్స్‌ల యజమానులు మద్యం అమ్మకాలు చేపడుతున్నారు. ఎక్సైజ్‌ అధికారులు సైతం బెల్ట్‌ షాపుల నిర్వహణకు అనుమతులు ఇస్తుండటం అనేక సందేహాలకు తావిస్తోంది. ఇటీవల మోర్తాడ్‌ మండలంలోని ఎనిమిది గ్రామాల్లో బెల్ట్‌ షాప్‌నకు టెండర్లు నిర్వహించగా గ్రామ కమిటీలకు రూ.30లక్షల ఆదాయం లభించడానికి ధర నిర్ణయమైంది. ఏర్గట్ల, కమ్మర్‌పల్లి, వేల్పూర్‌, బాల్కొండ, మెండోరా, ముప్కాల్‌ మండలాలతో పాటు ఆర్మూర్‌, నిజామాబాద్‌ రూరల్‌ నియోజకవర్గాలలోని గ్రామాల్లోను టెండర్లు నిర్వహించి బెల్ట్‌షాపుల నిర్వహణను వీడీసీలు కొందరు వ్యక్తులకు అప్పగించాయి. ఏది ఏమైనా బెల్ట్‌షాపులను మూసివేయడం కొన్ని రోజులే సాగింది. అధికారుల అండతోనే బెల్ట్‌షాపులు ప్రారంభమవుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

కామారెడ్డి టౌన్‌: కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో తప్పిపోయిన బాలుడిని పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. తాడ్వాయి మండలం కృష్ణాజివాడి గ్రామానికి చెందిన మరుపల్లి సౌందర్య తన రెండేళ్ల కుమారుడితో కలిసి జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బంధువులను పరామర్శించేందుకు గురువారం మధ్యాహ్నం వచ్చింది. ఈ క్రమంలో బాబును తన మరిదికి ఇచ్చి స్వగ్రామానికి వెళ్లాలని తెలిపినా అతను ఒంటరిగానే వెళ్లిపోయాడు. బాబును తన మరిది తీసుకెళ్లాడని భావించిన తల్లి గ్రామానికి వెళ్లింది. ఆస్పత్రిలోని వార్డుల్లో తిరుగుతూ ఒంటరిగా ఏడుస్తున్న బాబును గమనించిన సిబ్బంది ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్‌ లక్ష్మణ్‌కు అప్పగించారు. దీంతో అతను ఐసీడీఎస్‌ అధికారులకు సమాచారం అందించారు. తల్లి సౌందర్య బాబు తప్పిపోయాడని తెలిసి హుటాహుటిన సాయంత్రం ఆస్పత్రికి రాగా పోలీసులు బాబును తల్లితండ్రులకు అప్పగించారు.

ఆర్టీసీ అద్దె బస్సుల చర్చలు సఫలం



ఖలీల్‌వాడీ: ఆర్టీసీ అద్దె బస్సుల యజమానుల సంఘంతో జరిపిన చర్చలు సఫలమైనట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ముందుగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సమస్యలు విన్నవించిన అనంతరం బస్సు భవన్‌లో సజ్జనార్‌తో కలిసి జరిపిన చర్చలు సఫలమైనట్లు పేర్కొన్నారు. అద్దె బస్సు యజమానుల ప్రధాన నాలుగు డిమాండ్లను సానుకూలంగా స్పందించారని తెలిపారు. వారం రోజుల్లో సమస్యల పరిష్కారానికి ఓ కమిటీని వేసినట్లు చెప్పారు. ప్రయాణికులకు సంక్రాంతి పండుగకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అద్దె బస్సులు యథావిధిగా నడుస్తాయని ఆర్టీసీ ఎండీకి యజమానులు స్పష్టం చేశారు. సమావేశంలో రాష్ట్ర కమిటీతో పాటు జిల్లా సభ్యులు మధుకర్‌, గణేశ్‌ కుమార్‌ పాల్గొన్నారు.

సీఎంవో కార్యదర్శిని కలిసిన ట్రెసా నాయకులు



సుభాష్‌నగర్‌: సీఎం కార్యాలయ కార్యదర్శిగా నూతనంగా నియమితులైన సీనియర్‌ ఐఏఎస్‌ అధికారి చంద్రశేఖర్‌రెడ్డిని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్‌ అసోసియేషన్‌ (ట్రెసా) నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్‌ రెడ్డి, ప్రధానకార్యదర్శి గౌతంకుమార్‌, నిజామాబాద్‌ అధ్యక్షుడు రమన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అంకాపూర్‌లో హన్మకొండ రైతులు

పెర్కిట్‌: ఆర్మూర్‌ మండలం అంకాపూర్‌ గ్రామాన్ని హన్మకొండ జిల్లా ఐనవోలు మండలానికి చెందిన రైతులు సహాయ సోషల్‌ సర్వీస్‌ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు అంకాపూర్‌లో సాగవుతున్న పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అంకాపూర్‌ రైతులు సాగులో అవలంబిస్తున్న విధానాలు, నీటి యాజమాన్య పద్ధతులను గ్రామ గురడి రెడ్డి రైతు సంఘం అధ్యక్షుడు పీసీ గంగారెడ్డి, సభ్యుడు కేకే భాజన్నను అడిగి తెలుసుకున్నారు. అలాగే యాజమాన్య పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని నీటి నిలువ తొట్టెలు, విత్తన శుద్ధి కర్మగారాలను పరిశీలించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి విజయ్‌ కుమార్‌, రైతులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

తెయూ రిజిస్ట్రార్‌ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని తెయూ రిజిస్ట్రార్‌ యాదగిరి అన్నారు. తెయూ ఏబీవీపీ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్‌ చంద్రబోస్‌ జయంతి వేడుకలను పురస్కరించుకుని క్యాంపస్‌లో యువజన క్రీడోత్సవాలను గురువారం నిర్వహించారు. రిజిస్ట్రార్‌ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. స్వామి వివేకానంద చెప్పినట్లు ఉక్కు నరాలు, ఇనుప కండరాలు కలిగిన యువత దేశానికి అవసరమన్నారు. కబడ్డీ, క్రికెట్‌, వాలీబాల్‌, వ్యాసరచన, క్విజ్‌ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు శివ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగరాజ్‌, నాయకులు సాయి కుమార్‌, అమృత్‌ చారి, ప్రమోద్‌, సింహాద్రి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పీజీ కోర్సులకు అటానమస్‌ హోదా..



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్‌ రామ్మోహన్‌రెడ్డి

నిజామాబాద్‌అర్బన్‌: గిరిరాజ్‌ కళాశాలలోని పీజీ కోర్సులకు అటానమస్‌ హోదా లభించిందని, సిలబస్‌లో మార్పులు, పరీక్షలు నిర్వహించుకునే అవకాశం కళాశాలకే ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్‌ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. కళాశాలలో పీజీ కోర్సు మొదటి సంవత్సర విద్యార్థులకు ఒకరోజు ఓరియంటేషన్‌ ప్రోగ్రాంను గురువారం నిర్వహించారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు తమ నైపుణ్యాన్ని పెంచుకొని పోటీ పరీక్షలలో ప్రతిభ కనబరిచేందుకు సన్నద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపాల్‌ అబ్దుల్‌ రఫీక్‌, కో–ఆర్డినేటర్‌ సత్య వరప్రసాద్‌, భరత్‌ రాజ్‌, జాన్‌, సుకుమార్‌, ముత్యంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాలాజీ, రవిరాజ్‌, సునీత తదితరులు పాల్గొన్నారు.

అక్కడ ఫుల్‌.. ఇక్కడ నిల్‌



బోర్గాం మీ-సేవ సెంటర్‌ వద్ద చంటిపిల్లలతో..

ప్రజాపాలన దరఖాస్తుల పుణ్యమా అని జిల్లాలోని మీ సేవ, ఆధార్‌ సెంటర్ల వద్ద ఉదయం నుంచే ప్రజలు బారులుతీరుతున్నారు. ఆధార్‌కార్డుల్లో తప్పొప్పులను సవరించుకునేందుకు ఆధార్‌ కేంద్రాల వద్ద క్యూ కడుతున్నారు. పెద్ద సంఖ్యలో ఆధార్‌ కేంద్రాలకు చంటిపిల్లలతో ఉదయాన్నే చేరుకొని ఎదురుచూస్తున్నారు. ఇదే క్రమంలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలు ప్రజలు లేక బోసిపోతున్నాయి.

– సాక్షి స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌–నిజామాబాద్‌



పెద్దబజార్‌లోని మీ సేవ సెంటర్‌లో..



పాత మున్సిపల్‌ కార్యాలయంలో..



గాజులపేటలోని ప్రజాపాలనలో ప్రజలు లేని దృశ్యం

మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తాం

- రాష్ట్ర వైద్య శాఖ మంత్రి రాజనర్సింహ



మాట్లాడుతున్న మంత్రి రాజనర్సింహ

పెర్కిట్‌: గత ప్రభుత్వ పాలనలో నిర్లక్ష్యానికి గురైన విద్య, వైద్య ఆరోగ్య శాఖలను అభివృద్ధి చేస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. జక్రాన్‌పల్లి మండలంలో పలు కార్యక్రమాలకు హాజరైన మంత్రి ఆర్మూర్‌ మండలం అంకాపూర్‌లోని లాలన వృద్ధాశ్రమంలో కాసేపు సేదా తీరారు. ముఖ్యంగా సామాన్యునికి అత్యవసరమైన విద్య, వైద్య రంగాలపై కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ప్రధానమైన విద్య, వైద్య శాఖల్లో మౌలిక వసతులను పూర్తి చేసి నోటిఫికేషన్‌ ద్వారా సిబ్బందిని భర్తీ చేస్తామన్నారు. జిల్లాను సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ పరంగా అభివృద్ధి చేస్తామన్నారు.ఆర్మూర్‌ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌ రెడ్డి, నిజామాబాద్‌ రూరల్‌ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, జెడ్పీ చైర్మన్‌ దాదన్నగారి విఠల్‌ రావు, ఆర్మూర్‌, బాల్కొండ కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జీలు వినయ్‌ రెడ్డి, సునీల్‌రెడ్డి, నాయకుడు గడుగు గంగాధర్‌ తదితరులు పాల్గొన్నారు.


గంజాయిపై ఉక్కుపాదం మోపుతాం



బస్సులో తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్సై

మద్నూర్‌: కల్తీ కల్లు, గంజాయిపై ఉక్కుపాదం మోపుతామని బిచ్కుంద ఎక్సైజ్‌ సీఐ సత్యనారాయణ అన్నారు. మండలంలోని పెద్దశక్కర్గా, మద్నూర్‌, మేనూర్‌ గ్రామాల్లో కల్లు దుకాణాలు, తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులో గురువారం దాడులు నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. డగ్స్‌ రహిత సమాజం కోసం కృషి చేస్తున్నామని, దీని కోసం అందరూ సహకరించాలని కోరారు. మండలంలోని సలాబత్‌పూర్‌ వద్ద మహారాష్ట్ర–తెలంగాణ సరిహద్దు వెంట వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. పలు కల్లు దుకాణాల్లో తనిఖీ చేసినట్లు తెలిపారు. ఎవరైన అక్రమంగా మత్తు పదార్థాలు వాడినా, రవాణా చేసినా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఎక్సైజ్‌ ఎస్సై అభిషేక్‌, సిబ్బంది ఎల్లయ్య, పెంటయ్య, నవీన్‌రెడ్డి, శ్రీధర్‌, పరశురాం, అనిత, ప్రేమలత, వనిత, స్వరూప ఉన్నారు.

ఉప్పర్‌పల్లిలో పశువులకు చికిత్స



టీటీపేట: జిల్లాలోని పాడి రైతులు ఉచిత కృత్రిమ గర్భధారణ చికిత్స కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి సింహారావు అన్నారు. మండలంలోని ఉప్పర్‌పల్లిలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించినట్లు మండల పశువైద్యాధికారిణి హేమశ్రీ తెలిపారు. గ్రామంలోని పశువులకు కృత్రిమ గర్భధారణ పరీక్షలు నిర్వహించారు. పశువులకు గర్భకోశ వ్యాధులను గుర్తించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏడీలు సంజయ్‌, శ్రీనివాస్‌, డాక్టర్‌ రవికిరణ్‌, డాక్టర్‌ రాంచందర్‌, గోపాలమిత్రలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

బాన్సువాడ రూరల్‌: వర్ని మండలం చింతల్‌పేట్‌ తండాకు చెందిన కాత్రోత్‌ పీర్యా(47) విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు సీఐ మహేందర్‌రెడ్డి గురువారం తెలిపారు. తండాకు చెందిన పీర్యా అదే తండాకు చెందిన రాందాస్‌తో కలిసి మార్గమధ్యలో ఉన్న శంకర్‌ పంట పొలానికి ఉన్న జీఏ వైరును తాకారు. దీంతో వారికి విద్యుదాఘాతం సంభవించి కిందపడిపోయారు. గమనించిన స్థానికులు రాందాస్‌కు గాయాలు కాగా, పీర్యాను ఆస్పత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య కళావతి ఫిర్యాదు మేరకు శంకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని బోర్గాంకు చెందిన నరేశ్‌(30) అదృశ్యమైనట్లు ఎస్సై సంజీవ్‌ తెలిపారు. గత నెల డిసెంబర్‌ 20న ఇంటి నుంచి పని కోసం వెళ్లిన అతను తిరిగి రాలేదు. పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్రైం కార్నర్‌

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య



కాత్రోత్‌ శ్రీకాంత్‌(ఫైల్‌)

నాగిరెడ్డిపేట: మద్యానికి బానిసైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజు గురువారం తెలిపారు. మండలంలోని ధర్మారెడ్డి తండాకు చెందిన కాత్రోత్‌ శ్రీకాంత్‌ (31) వ్యవసాయ పనులు చేస్తుంటాడు. ఇటీవల మెదక్‌ జిల్లాకు చెందిన ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వారి మధ్య గొడవలు చోటు చేసుకోవడంతో మద్యానికి అలవాటుపడ్డాడు. ఈ క్రమంలో ఈ నెల 1న గడ్డిమందు తాగి కుటుంబీకులకు తెలిపాడు. గతంలో శ్రీకాంత్‌ ఇలాగే గడ్డిమందు తాగినట్లు బెదిరించేవాడనే కారణంతో కుటుంబీకులు నమ్మలేదు. బుధవారం శ్రీకాంత్‌ను ఎల్లారెడ్డి ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌ తీసుకెళ్లాలని సూచించారు. దీంతో వారు ఇంటికి రాగా బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి సోదరుడు కాత్రోత్‌ సర్వన్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైలు కింద పడి యువకుడు..

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని దర్శన్‌ థియేటర్‌ ప్రాంతంలో రైలు కింద పడి ఓ యువకుడు బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై తావూనాయక్‌ గురువారం తెలిపారు. దోమకొండకు చెందిన కామిండ్ల నరేందర్‌(26) కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇటీవల ఆయన మానసిక పరిస్థితి దెబ్బతిన్నది. బుధవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిన అతను రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వ్యాపారి ఇంటిపై అధికారుల దాడి

- 89 క్వింటాళ్ల రేషన్‌ బియ్యం పట్టివేత



మాచారెడ్డి: మాచారెడ్డి చౌరస్తాలో ఓ వ్యాపారి ఇంటిపై టాస్క్‌ ఫోర్స్‌ అధికారులు గురువారం దాడి చేశారు. దాడిలో అక్రమంగా నిల్వ చేసిన 89 క్వింటాళ్ల రేషన్‌ బియ్యాన్ని పట్టుకున్నట్లు టాస్క్‌ ఫోర్స్‌ ఓఎస్డీ శ్రీధర్‌ రెడ్డి తెలిపారు. మ్యాడమ్‌ వెంకట్‌ రాములు అనే వ్యాపారి కొన్ని రోజులుగా రేషన్‌ బియ్యాన్ని కొనుగోలు చేస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు దాడి చేసినట్లు చెప్పారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దాడిలో అధికారులు సుదర్శన్‌ రెడ్డి, శ్రీనివాస్‌ రావు, లక్ష్మయ్య, కిష్టయ్య ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్‌ సీజ్‌



వర్ని: ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్‌ చేసినట్లు ఎస్సై కృష్ణకుమార్‌ గురువారం తెలిపారు. వర్ని పీఎస్‌ పరిధిలోని లక్ష్మాపూర్‌ అటవీ ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.